క్లుప్తంగా

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పలువురు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నెల్లూరు, కావలి ఈఈలు మోహన్‌రావు, మాధవరావు, జేఏసీ వర్కింగ్ చైర్మన్ మనోజ్‌కుమార్, కోవూరు డీఈ వెంకటేశ్వర్లు తదితరులు సత్కరించారు. డీఈఈలుగా ఉద్యోగోన్నతులను కల్పించాలని కోరారు. విజిలెన్స్ నోటీసులపై మంత్రితో చర్చించారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బారకాసు): పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పొదలకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో డాక్టర్ మన్నెం సతీష్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రతిభ చూపిన 115 మంది విద్యార్థులకు ప్రశంసపత్రం, నగదు పురస్కారాలను అందజేశారు. సీపీఐ నేత పముజుల దశరథరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటసురేష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, హాజరతయ్య, జక్కల సురేష్, రాజేంద్రప్రసాద్, కన్నా రాఘవరావు, డాక్టర్ సతీష్‌కుమార్, మన్నెం రవీంద్రనాథ్ టాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ, దాశరథి ఆధ్వర్యంలో అర్చకులు జరిపారు. కల్యాణానంతరం భక్తులకు ప్రసాదాలు, అక్షతలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఉభయకర్తలుగా దేశ్‌పాల్ సింగ్, దేవకీదేవి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ అప్రైజర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఆంజనేయులు

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న గోల్డ్ జ్యువెల్ అప్రైజర్ల సంక్షేమానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని చీఫ్ మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని ఎస్సార్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీజీబీ జ్యువెల్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ అభివృద్ధిలో గోల్డ్ అప్రైజర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విశ్వబ్రాహ్మణ సంఘ నెల్లూరు అధ్యక్షుడు చెంగయ్య ఆచారి, గౌరవాధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్పొరేటర్ రామకృష్ణ, వెంకటశేషయ్య, రాఘవ, కల్యాణకుమార్, అప్రైజర్ల సంఘ జిల్లా నేతలు కుర్చేటి శ్రీనివాస్ ఆచారి, రాఘవేంద్ర, రవిశంకర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ములుమూడిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్



నెల్లూరు సిటీ: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ములుమూడిలో ఆదివారం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ రైస్ రీసెర్చ్ హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు నాగేశ్వరరావు, లక్ష్మీప్రసన్న హాజరయ్యారు. వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, లోకేశ్, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, సహాయ వ్యవసాయ సంచాలకుడు నందం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణే మిగిలింది

- ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల్లో సన్నగిల్లుతున్న ఆశలు
- అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్న కూటమి నేతలు



పొదలకూరు : అధికారమే పరమావధిగా కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో ఆచరణకు నోచుకోని పథకాలను వల్లెవేశారు. ఇచ్చిన హామీలను తప్పకుండా పాటించి పేదలకు సాయం చేస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలు ఊసే ఎత్తకుండా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు సూపర్‌సిక్స్ పథకాలు అమలు అవుతాయని ఎదురుచూస్తుండగా సమయం గడిచిపోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు ప్రయాణం చేద్దామని మహిళలు ఎదురుచూస్తుండగా ఇప్పటి వరకు పథకం అమలు కాలేదు. ఆగస్టు నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం వెల్లడిస్తోంది. అయితే అప్పుడైనా పథకం అమలు అవుతుందాని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సర్వేపల్లిలో 1,34.674 మంది మహిళలు

సర్వేపల్లి నియోజకవర్గంలో 1,34,674 మంది మహిళలు ఉన్నారు. వీరిలో కనీసం సగం మందికి పైగా ఉచిత బస్సు ఎక్కాలని ఆశిస్తున్నారు. అధిక సంఖ్యాకులు పేద, దిగువ మధ్య తరగతికి చెందిన మహిళలే ఉన్నారు. వీరంతా ఉచిత బస్సుల్లో ప్రయాణిస్తే కొంతలో కొంత నగదు మిగిలే అవకాశం ఉందంటూ ఆశపడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఆర్థిక ఇబ్బందుల గురించి తరచూ ప్రస్తావిస్తుండడంతో పథకాలు అమలుకు నోచుకుంటాయానే సందేహం వెలుబుచ్చుతున్నారు.

వెసులుబాటు ఉంటుంది



ఉచిత బస్సులు ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రంలో చిన్నపాటి ఉద్యోగాలు చేసుకునే మహిళలకు వెసులుబాటుగా ఉంటుంది. ఏడాదిగా ఎదరుచూస్తున్నాం. ప్రతినిత్యం జిల్లా కేంద్రానికి వెళ్లి బాధ్యతలు నిర్వహించి వచ్చేందుకు నెలవారీ చార్జీలు బాగానే అవుతున్నాయి.

– డి.శ్రావణి, పూడిపర్తి, వెంకటాచలం మండలం

వెంటనే అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇప్పటి వరకు అమలు చేయలేదు. దీనికోసం ఎదరుచూపులే మిగిలాయి. వెంటనే అమలు చేస్తే మహిళలకు మేలు జరుగుతుంది.

– బి.ప్రసన్నలక్ష్మి, మనుబోలు

అనుమానాలున్నాయి



మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను వెంటనే అమలు చేయాలి. ఆగస్టులో అంటున్నా మళ్లీ వాయిదా పడుతుందనే అనుమానాలు ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణం హామీపై మహిళలు చాలామంది కూటమిని ఆదరించారు.

– ఎం.విజయ, సీఆర్‌పురం, మనుబోలు మండలం

ఎదురు చూస్తున్నాం



ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు ఎదరు చూస్తున్నాం. ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి ఉంది. సూపర్‌సిక్స్‌లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం వీలైనంత త్వరగా అమలు చేయాలి.

– కె.సంధ్య, మొగళ్లూరు, పొదలకూరు మండలం

తొలిరోజే అవస్థలు



సర్వర్ పనిచేయక అవస్థ పడుతున్న మహిళ



సరుకులు మోసుకెళ్తున్న వృద్ధులు

- సర్వర్ బిజీతో వెనుదిరిగిన కార్డు హోల్డర్లు
- ఇబ్బందులు పడిన వృద్ధులు

పొదలకూరు : ఎండీయూ వాహనాలను రద్దు చేసి పాత పద్ధతిలో ప్రజలకు రేషన్ సరుకులను అందజేసేందుకు కూటమి ప్రభుత్వం చౌకదుకాణాలను పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలు, పట్టణాల్లో టీడీపీ నాయకులు రేషన్‌షాపులను పునఃప్రారంభించారు. అయితే తొలిరోజే కార్డు హోల్డర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు సర్వర్ పనిచేయక గంటల తరబడి షాపు వద్దనే కూర్చున్నారు. కొందరు ఓపిక నశించి తర్వాత వస్తామని చెప్పి వెనుదిరిగారు. ఉదయం 6 గంటల్లోపు సరుకులను అందజేసే ప్రక్రియను ప్రారంభించిన డీలర్లు మాత్రం కొందమందికి బియ్యం అందజేశారు. తర్వాత 8 నుంచి సర్వర్ మొరాయించడంతో సరుకులను డీలర్లు సక్రమంగా అందజేయలేక గంటకు ఒకరిద్దరికి మాత్రం పంపిణీ చేయగలిగారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎండీయూ వాహనాలు 53 ఉండగా వాటిని రద్దు చేశారు. రేషన్‌షాపులు మొత్తం 205 ఉన్నాయి. కార్డు హోల్డర్లు 91,371 మంది ఉన్నట్టు అంచనా ఉంది. ఇకపై ప్రతినెలా 15వ తేదీ వరకు రేషన్‌డీలర్లు బియ్యం, ఇతర సరుకులను షాపుల ద్వారా అందజేస్తారు. అయితే గ్రామాల్లో చాలామంది ప్రారంభం రోజునే బియ్యం పట్టుకుపోవాలని హాజరయ్యారు.



షాపు వద్ద వేచి ఉన్న కార్డుహోల్డర్లు

తాగునీరు నేలపాలు



కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలోని గమళ్లపాళెంలో కుళాయి ద్వారా తాగునీరు వృథా అవుతోంది. ఇక్కడ ఉన్న వీధి కుళాయికి మూత్ లేక పోవడంతో నిరంతరం నీరు వృథాగా పోతోంది. గ్రామంలో పలుచోట్ల ఇలాగే మూత్‌లు లేని కుళాయిల ఉన్నాయి. నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన వేసవి కాలంలో ఇలా వృథా చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

మనుబోలులో హిజ్రాల హల్‌చల్



మనుబోలులో షాపుల వద్ద హల్‌చల్ చేస్తున్న హిజ్రాలు

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో కొంత కాలంగా హిజ్రాలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. రైళ్లు, బజార్లలో హిజ్రాలు నగదు యాచించడం చూస్తూనే ఉంటాం. అయితే ఇప్పుడు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. డబ్బులివ్వని వారితో గొడవలకు దిగడం, అసభ్యంగా మాట్లాడడం చేస్తుండడంతో ప్రతిఒక్కరూ వారికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తోంది. హిజ్రాల తీరుతో దుకాణదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు స్పందించి హిజ్రాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ ముప్పును తొలగించాలి

నెల్లూరు రూరల్: ప్లాస్టిక్‌తో ఏర్పడుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు గానూ ప్రజలు అవగాహనతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు విభాగ పర్యావరణ ఇంజినీర్ అశోక్ పేర్కొన్నారు. ప్లాస్టిక్‌తో సంభవించే అనర్థాలపై రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్లో అవగాహన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు.

బేలూరు మఠానికి రామ కృష్ణ సేవాశ్రమ అప్పగింత

నెల్లూరు సిటీ: మూడో మైల్లోని రామకృష్ణ సేవాశ్రమాన్ని రామకృష్ణ మిషన్, బేలూరు మఠం కోల్‌కతా వారికి అప్పగించామని మిషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, సెక్రటరీ నరసయ్య పేర్కొన్నారు. తద్విదానంద మహారాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ మంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

'వెన్నుపోటు' దినంపై సమీక్ష



మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినంపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 4న కోవూరు పట్టణంలోని బజారు సెంటర్‌లో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కోవూరు మండలంలోని ప్రతి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, వీరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు

విడవలూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉత్సాహం నింపే దిశగా విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ టి.నిరూప అన్నారు. విడవలూరులోని గ్రంథాలయంలో చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని, పాఠశాల నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ పఠనాశక్తి పెంపొందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



పుస్తకాల ఆవశ్యకతను వివరిస్తున్న లైబ్రేరియన్ నిరూప

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సీపీఎం నేత చంద్ర రాజగోపాల్

పొదలకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు చంద్ర రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భూములను కారుచౌకగా అప్పగిస్తున్నట్లు ఆరోపించారు. రైతాంగం వివిధ రకాల సమస్యలను ఎదుర్కొంటోందని, పార్టీ ఉద్యమించాల్సిందిగా పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, దేశంలో నిరుద్యోగం సమస్య పెరిగిపోయిందన్నారు. సమావేశంలో పార్టీ ఏరియా ఆర్గనైజర్ అల్లాడి గోపాల్, మండల నాయకులు బి.మనోహర్, గుడి మణి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్

శోభాయాత్రను జయప్రదం చేయాలి

పొదలకూరు : పట్టణంలో ఈనెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని హిందూ చైతన్య వేదిక నిర్వాహకుడు ఛత్రపతి మస్తాన్‌బాబు కోరారు. ఈ మేరకు స్థానిక ఆంజనేయస్వామి, వినాయకస్వామి దేవస్థానాల్లో శోభాయాత్ర కరపత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. పట్టణ ప్రజలు యాత్రను విజయవంతం చేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరించిన నిర్వాహకులు

స్థలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారు

విడవలూరు: ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన కొందరు మా స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన కొమరగిరి నాగమణి అన్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన ఇండ్ల సుబ్బమ్మ, ఏకుల మణి ఊటుకూరు శివారులోని వారి స్థలం వద్ద ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన చుక్కా పరంధామయ్య అనే వ్యక్తి దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ భూములకు పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడిగా ఉండేవారని, అప్పుడు తాము దళితులమని, జీవనాధారంగా ఎలాంటి వనరులు లేవని మొరపెట్టుకోగా ప్రభుత్వాధికారులు తమకు జామాయిల్ చెట్లు ఇచ్చి ఇదే స్థలంలో పెంచుకోమని చెప్పినట్లు తెలియజేశారు. అయితే ఈ నేలలో జామాయిల్ సరిగ్గా రాకపోవడంతో తోట ఎండిపోయిందని, అప్పటి నుంచి చాలా కాలం ఈ స్థలం కాళీగా ఉండటంతో కంప చెట్లు పెరిగాయని, కొంతకాలం తర్వాత తమ వద్ద డబ్బులు లేక ఈ భూమిని తమ గ్రామంలోనే కొందరికి లీజుకు ఇవ్వడంతో వారు రొయ్యల గుంతలుగా చేసి ఏటా కొంత లీజు సొమ్మును అందించేవారని తెలియజేశారు. ప్రభుత్వం మాకు స్థలం కేటాయించినట్లే శంకర్ నగర్‌కు చెందిన వ్యక్తులకు కూడా స్థలాన్ని కేటాయించిందని, వారు కూడా వారి స్థలాన్ని రొయ్యల గుంతలుగా మార్చుకోగా ఇప్పుడు పక్కనే ఉన్న మా స్థలంపై వారి కన్ను పడిందన్నారు. దీనిపై ప్రశ్నిస్తే తమను చులకనగా మాట్లాడుతూ అవమానిస్తున్నారని తెలియజేశారు. స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రవల్లిక, చెంబేటి పుట్టమ్మ, మణి, లలిత, పొన్నూరు శారద, నాగేశ్వరి, రాపూరు బాబులు, వాసు, విగ్నేష్, భాను ప్రసాద్, నాని, నాగేశ్వర్, పోలయ్య, శ్రీధర్, గంగమ్మ, శ్యామల పాల్గొన్నారు.



స్థలం తమదంటూ పత్రాలు చూపుతున్న గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇందుకూరుపేట: కొత్తూరులో..



కోవూరు: చెర్లోపాళెం పాఠశాలలో..

ఇందుకూరుపేట: ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో 1994–95 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కొత్తూరులో జరిగింది. ఈ సందర్భంగా తరగతి గదులు, క్రీడా మైదానంలో చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగం, కుటుంబం, పిల్లలు తదితర విషయాలపై ఆరా తీసుకొన్నారు.

➡ కోవూరు: మండలంలోని చెర్లోపాళెం ప్రాథమిక పాఠశాలలో 1997– 2009 వరకు చదివిన విద్యార్థులు బ్యాచ్ల వారీగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. ఉపాధ్యాయులు ఐ.ఉమామహేష్, సీహెచ్ సురేంద్ర పాల్గొన్నారు.